సాక్షి
హనుమకొండ
శనివారం | 4 | మార్చి | 2023




హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో యోగా సాధన చేస్తున్న యువత

యోగోత్సాహం

- 8లో ▶

హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న యోగా మహోత్సవం శుక్రవారం సాయంత్రం ప్రారంభమైంది. రాష్ట్ర సాంస్కృతిక శాఖ, హార్ట్ ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాన్ని రామచంద్ర మిషన్ యోగా గురువు, పద్మవిభూషణ్ దాజి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, గోపి, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, ప్రఖ్యాత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, సీపీ రంగనాథ్, వీసీ రమేశ్ తదితరులు హాజరయ్యారు.

- హన్మకొండ కల్చరల్

న్యూస్‌రీల్

కళాక్షేత్రం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



హన్మకొండ కల్చరల్: కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో కలెక్టర్.. మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్యాతో కలిసి కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.55కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కళాక్షేత్రం పనులు మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అధికారులు క్షేత్ర స్థాయిలో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, డీఈ రఘునాథ్, ఏఈలు, డీఈలు, బృంద ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కాంట్రాక్ట్ ప్రతినిధి రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6న స్ప్రింగ్ స్ప్రీ-23 థీం ఆవిష్కరణ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న కల్చరల్ ఫెస్ట్ స్ప్రింగ్ స్ప్రీ-23 థీంను ఈనెల 6న ఆవిష్కరించనున్నట్లు డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ పులి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నిట్ టైమ్ స్క్వేర్ ప్లాజా ఆవరణలో అట్టహాసంగా స్ప్రింగ్ స్ప్రీ-23 థీంను ఆవిష్కరించనున్నామని, ముఖ్యఅతిథిగా నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

నిట్‌లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ : డైరెక్టర్



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో త్రీడీ ప్రింటింగ్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ భవనంలో గల ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ ల్యాబ్‌లో రూ.65లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన త్రీడీ ప్రింటింగ్ మిషన్‌ను నిట్ డైరెక్టర్ శుక్రవారం ప్రారంభించి.. మాట్లాడారు. త్రీడీ స్ప్రింట్ సాఫ్ట్‌వేర్‌తో ప్రొటోటైప్ ప్రొడక్ట్స్ ప్రింటింగ్‌కు, రీసెర్చ్ స్కాలర్స్, పారిశ్రామిక వేత్తలకు అనుగుణంగా, ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటికే సీమెన్స్‌లో 13 ల్యాబ్స్ ఉండగా.. త్వరలో 18 ల్యాబ్స్‌ను ఏర్పాటు చేసి మూడేళ్లలో 30వేల మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీమెన్స్ సీఈఓ, ప్రొఫెసర్ ఎల్.కృష్ణానంద్, సీమెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు డైరెక్టర్ల ఎన్నిక



వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా న్యాయవాదుల పరస్పర సహాయ సహకార సంఘం డైరెక్టర్లుగా ఎస్.విద్యాసాగర్, గంధం సురేశ్, ఎస్.చంద్రశేఖర్, రాము ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్.భాగమ్మ, చిదంబర్‌నాథ్ తెలిపారు. కోర్టులోని పాత బార్ అసోసియేషన్(మహాత్మా గాంధీ హాల్)లో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొత్తం 1,234 ఓట్లకుగాను.. 680 ఓట్లు పోలైనట్లు తెలిపారు. అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపులో ఎస్.విద్యాసాగర్(381), గంధం సురేశ్(343), ఎస్.చంద్రశేఖర్(326), పీసరి రాము(303) సాధించి విజేతలుగా నిలిచినట్లు వారు తెలిపారు. కాగా.. డైరెక్టర్లుగా ఎన్నికైన వారికి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

నీళ్లెప్పుడొస్తయో..!

తాగునీటికి రోజూ ఎదురుచూపులేనా..
- మేయర్ సమీక్షలో కార్పొరేటర్ల గోడు
- ఇక రోజూ తాగునీరు: నగర మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: 'రోజు విడిచి రోజు నీళ్లిస్తున్నరు. సమయపాలన పాటించడం లేదు. ప్రెషర్ తక్కువగా వస్తోంది. ఎన్ని బిందెల నీళ్లొస్తయో తెలియదు. నల్లా నీళ్ల కోసం రోజూ ఎదురుచూపులే. ఎండా కాలంలో ఇట్లయితే ప్రజలు నిలదీస్తరు..' ఇలా పలువురు కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మేయర్ సుధారాణి, కమిషనర్ ప్రావీణ్య, 12, 13, 18, 22, 35, 40, 41 డివిజన్ల కార్పొరేటర్లు, ఇంజనీర్లతో వేసవిలో నీటి సరఫరా, వర్షాకాలంలో వరద ముంపుపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ పరిధిలోని సమస్యలను వివరించారు. దేశాయిపేటలో పైపులైన్ల ఏర్పాటు, చేతిపంపుల మరమ్మతు, కుమ్మరివాడ వద్ద ఓపెన్ డ్రెయిన్ నిర్మించాలని కార్పొరేటర్ కావేటి కవిత విన్నవించారు. ఏనుమాముల ట్యాంక్ నుంచి కాకుండా ఫిల్టర్‌బెడ్ నుంచి నీటి సరఫరా చేయాలని, వడ్డేపల్లి చెరువు సమీపంలో గుడిసెల వద్ద వరద నీరు స్తంభించిపోతుందని, వీవర్స్ కాలనీ శ్మశాన వాటికకు ప్రహరీ ఏర్పాటు చేయాలని సభ్యుడు సురేశ్ జోషి విజ్ఞప్తి చేశారు. ఎస్సార్టీ వాటర్ ట్యాంక్ ఎత్తయిన ప్రదేశంలో ఉండటం వల్ల నీరు పంపింగ్ జరగడం లేదని, పలు కాలనీలకు నీటి సమస్య ఉందని, 3 మోటార్లు, కొత్తగా వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బ్యాంక్ కాలనీ, వాసవీ నగర్ 80 ఫీట్ల రోడ్డు, ఎస్సీ కాలనీలకు మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని రామనాథపురి, ఎంవీ కాలనీలకు ఇంటర్ కనెక్షన్ చేయాలని కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి పేర్కొన్నారు. శివనగర్, పుప్పాలగుట్ట, చింతల్ ఏసీ రెడ్డి నగర్, సిక్కులవాడలో మంచినీటి సరఫరా సమస్య ఉందని, కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులైన్లకు ఇంటర్ కనెక్షన్లు చేయాలని, లీకేజీలను అరికట్టాలని, వేసవిలో అధిక వాటర్ ట్యాంకులు పెట్టాలని కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్‌కుమార్ కోరారు. సుభాష్ నగర్, ఉర్సు దర్గా, కుమ్మరివాడ సమీప ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు వేయాలని, ఒకే ఇంటికి ఉన్న రెండు కనెక్షన్లు తొలగించాలని కార్పొరేటర్ మరుపల్లి రవి పేర్కొన్నారు. నాగేంద్ర నగర్ చైతన్య నగర్, కాశికుంట ప్రాంతాలకు పైపులైన్ కనెక్షన్ ఉంది. కానీ.. నీటి సరఫరా జరగడం లేదని, విశ్వనాథ కాలనీకి మంచినీటి పైపులైన్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సభ్యురాలు పోశాల పద్మ తెలిపారు.





సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ ప్రావీణ్య

ఇక రోజూ సరఫరా: మేయర్

వేసవిలో ఇబ్బంది లేకుండా రోజూ తాగునీటి సరఫరా జరుగుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నీటి సమస్యపై హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై బోర్డు రిటైర్డ్ ఆపరేషన్ డైరెక్టర్ రవికుమార్‌ను నియమించారని, కొత్తగా 125 మంది శిక్షణ సిబ్బందిని తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రిటైర్డ్ డైరెక్టర్ రవి, ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ పెంచాల్సిందే..

ఎంజీఎం ఆస్పత్రిలో మరింత నిఘా అవసరం
- ఉన్నవాటిలో సగానికి పైగా కెమెరాలు మొరాయింపు
- వాటిపై సరైన పర్యవేక్షణ ఉంటే మేలు
- మెడికో ప్రీతి ఘటనతో కెమెరాల ఆవశ్యకతపై చర్చ



సాక్షి, వరంగల్: ఉత్తర తెలంగాణకే తలమానికమైన వరంగల్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్(ఎంజీఎం) ఆస్పత్రిలో నిఘా మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ప్రతీ రోజు వెయ్యి మంది వరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతోపాటు అవుట్ పేషెంట్లు కూడా వేలల్లో ఉండడంతో ఈ బడా ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రతాపరంగా సీసీ కెమెరాలు పెంచాలి. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ) అనస్తీషియా తొలి సంవత్సరం కోర్సు చదువుతున్న ధరావత్ ప్రీతి ఘటన ఎంజీఎం ఆస్పత్రిలోనే జరగడంతో అందరి దృష్టి సీసీ కెమెరాల వైపు మళ్లింది. అయితే ఇంత పెద్ద ఆస్పత్రిలో కేవలం 30 సీసీ టీవీ కెమెరాలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా అప్పుడప్పుడు మొరాయిస్తుండడంతో మరమ్మతులు చేయించి నిర్వహిస్తున్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు ఈ ఆస్పత్రిలో సీసీ కెమెరాలు బిగించామని ఆర్ఎంఓ మురళి అంటున్నారు. ఎంజీఎం ఆస్పత్రి, కరోనా వార్డు కలుపుకొని 30 వరకు నిఘా నేత్రాలు ఉన్నా.. పర్యవేక్షణా లోపంతో ప్రధాన వార్డుల్లో చాలా వరకు ఉన్న సీసీ టీవీ కెమెరాలు అప్పుడప్పుడు పనిచేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రీతి లాంటి ఘటన ఏదైనా జరిగిన సమయంలో ఈ నిఘా నేత్రాలే కీలకంగా ఉంటాయి. ఈ ఫుటేజీలకు చిక్కిన దృశ్యాలు ఏకంగా కేసును ఛేదించే స్థాయి వరకు తీసుకెళ్తాయి.

ఇంకా పెంచాలి..

దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో 1,300 పడకలు ఉన్న ఈ బడా ఆస్పత్రిలో రోజుకు రోగులు వేలల్లో వచ్చి వెళ్తుంటారు. రోగి సీరియస్‌గా ఉన్న సమయాల్లో వైద్యులు, సిబ్బందితోనూ గొడవలు జరుగుతుంటాయి. చికిత్స పొందుతున్న రోగులతోపాటు బంధువుల సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లు చోరీకి గురవుతున్న ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. వీటికి తోడు కొందరు సెక్యూరిటీ సిబ్బందికి రోగుల బంధువులు చేయి తడిపితే తప్ప లోపలికి వెళ్లనివ్వరనే వీడియోలు సోషల్ మీడియాలోనూ వైరల్ అయిన దాఖలాలు ఉన్నాయి. ఆస్పత్రి ప్రాంగణాల్లోనూ పార్క్ చేసిన రోగుల వాహనాలు మాయమైన ఘటనలు ఉన్నాయి. సీసీ కెమెరాలు మరిన్ని పెంచితేనే వీటికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

నిర్వహణ లోపంతోనే...

వీటన్నింటికి చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో డాక్టర్ మనోహర్ సూపరింటెండెంట్‌గా ఉన్న సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పార్ట్‌నర్(పీపీపీ) పద్ధతిలో ఓ ప్రైవేట్ కంపెనీ సీసీ కెమెరాలను ఆస్పత్రిలో బిగించింది. ఓ రెండేళ్లపాటు బాగానే ఈ నిఘా నేత్రాలు పనిచేయడంతో చాలా వరకు ఘటనలు తగ్గాయి. ఆ తర్వాత వీటి నిర్వహణలో నిర్లక్ష్యం చేయడంతో ప్రధాన ఘటనలు జరిగినప్పుడు కూడా సీసీ టీవీ ఫుటేజీ అందుబాటులో ఉండడం లేదన్న టాక్ వస్తోంది. అందుకే సిబ్బంది చేతివాటం కూడా మళ్లీ మొదలైందన్న వాదన వినబడుతోంది. అందుకే ఈ తరహా ఘటనలు తగ్గాలంటే ప్రధాన వార్డుల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు పెంచాలని, ఉన్న నిఘా నేత్రాలన్నీ పనిచేసేలా చూడాలన్న డిమాండ్ రోగుల నుంచి వినిపిస్తోంది. 'ఆస్పత్రిలో సీసీ కెమెరాలు పెంచాలి. అవినీతి ఆగాలన్నా, వైద్యులపై దాడులు ఆగాలన్నా, వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపడాలన్నా, ఏదైనా ఘటన జరిగినా దానిని ధ్రువీకరించాలన్నా సీసీ కెమెరాలు ఆవశ్యం. ముఖ్యంగా పిల్లల వార్డు నుంచి పిల్లలు అపహరణకు గురికాకుండా ఉండేందుకు కూడా ఇవి ముఖ్యమే. వీటిని బిగించడమే కాదు పర్యవేక్షించడానికి ప్రత్యేక వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఉంది' అని ఎంజీఎంకు వచ్చిన ఓ రోగి బంధువు వెంకటేశ్వర్లు అన్నారు.

కుక్కలను పట్టుకెళ్లండి సార్..

- వీధుల్లో తిరగలేకపోతున్నామని నగరవాసుల ఆవేదన
- బల్దియాలో రోజుకు 15కు పైగా ఫిర్యాదులు

వరంగల్ అర్బన్: వీధి కుక్కల వల్ల కాలనీల్లో కాలు పెట్టలేకపోతున్నాం.. వెంటనే వాటిని పట్టుకెళ్లండి సార్.. అంటూ బల్దియా ప్రధాన కార్యాలయంలోని హెల్ప్‌లైన్ 1800425 1980 నంబర్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. కుక్కల నుంచి ఎదురయ్యే తిప్పలపై పది రోజుల నుంచి ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకు 130 వరకు ఫిర్యాదులు నమోదయ్యాయి. మహా నగరంలో వెనుకబడిన నాలుగైదు ప్రాంతాల నుంచి రోజుకు కుక్క కాట్లకు గురైనట్లు వినతులు అందుతున్నాయి. హెల్ప్‌లైన్ ద్వారా కుక్కలపై ఫిర్యాదులు నమోదు చేసుకుంటూ.. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఆ సమాచారం అందిస్తున్నారు. కానీ.. దీనిపై స్పందన లేకపోవడంతో పలు కాలనీల ప్రజలు పదే పదే ఫోన్ చేస్తూ సమస్యపై మొరపెట్టుకుంటున్నారు. కుక్కలను పట్టుకోకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆ విభాగానికి ఒకే ఒక్కడు..

బల్దియా ప్రజారోగ్య విభాగంలో వెటర్నటీ వైద్యుడు ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఆయనకు సహాయకులుగా ఎవరూ లేరు. ఆయన మాత్రమే కుక్కలు, కోతుల సమస్యలపై స్పందించాల్సిన పరిస్థితి దాపురించింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు మున్సిపల్ హెల్త్ అధికారుల పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తుంటారు. దీంతో వీరు పెద్దగా స్పందించడం లేదనే విమర్శలున్నాయి. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల నిర్వహణ ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ సిబ్బంది హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని రెండు వాహనాల్లో కేవలం 20 కుక్కలను పట్టుకొని హనుమకొండ భీమారం కెనాల్‌కు సమీపంలో శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. వాటిని మూడు రోజులపాటు పర్యవేక్షించిన అనంతరం ఆయా ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. నగరంలో కుక్కల సంఖ్య పెద్ద మొత్తంలో ఉంది. అయితే బల్దియా పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు దృష్టి సారించి వీధి కుక్కలను లెక్కిస్తూ.. రోజువారీగా శస్త్ర చికిత్సల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కాలనీలో కుక్కలను పట్టుకెళ్తున్న ఏజెన్సీ సిబ్బంది

5న ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రరీక్ష

విద్యారణ్యపురి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరికలకు ప్రవేశ పరీక్ష ఈనెల 5న జరగనుందని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్, మడికొండ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ డి.ఉమామహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 33 ప్రతిభా కళాశాలల్లో(సీఓఈ)లో 2023-24 విద్యాసంవత్సరంలో ఇంటర్‌లో మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ అడ్మిషన్ల కొరకు ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించారు. వీరికి ప్రవేశ పరీక్ష ఈనెల 5న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించబోతున్నారని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ఆధార్ కార్డు, నీలిరంగు, నల్లరంగు, పెన్నులు, ప్యాడ్‌తో సహా పరీక్షకు గంట ముందుగానే హాజరు కావాలని ఆమె కోరారు.

'బండ' ధరపై భగ్గుమన్న బీఆర్ఎస్

హన్మకొండ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి పేదలు, సామాన్యులపై పెనుభారం మోపడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. కట్టెల పొయ్యిపై వంటావార్పు చేసి నిరసన తెలిపాయి. వెంటనే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హనుమకొండ చౌరస్తాలో బీజేపీ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ గడిచిన ఎనిమిదేళ్లుగా మోదీ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. గ్యాస్ ధరలు పెంచడంతో పేదలు రెండు పూటలా వంట చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజు యాదవ్, కార్పొరేటర్ బొంగు అశోక్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, నెక్కొండ కిషన్, నాయకులు పులి రజనీకాంత్, బొల్లెపెల్లి పున్నంచందర్, కూచన సునీల్, పానుగంటి శ్రీధర్, చింతాకుల ప్రభాకర్, మహ్మద్ నయీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వంటావార్పులో నినాదాలు చేస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, మేయర్ సుధారాణి

'భరోసా' ఇచ్చేలా పనిచేయాలి

సీపీ ఏవీ రంగనాథ్

వరంగల్ క్రైం: లైంగిక దాడులకు గురైన మహిళలు, చిన్నారులకు న్యాయం జరిగే విధంగా భరోసా కేంద్రం పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా శుక్రవారం ఆయన భరోసా కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం పనితీరుపై సమీక్ష నిర్వహించారు. భరోసా కేంద్రం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు కేంద్రాన్ని ఆశ్రయించిన బాధితుల సంఖ్య, వారిలో ఎంత మంది బాధితులకు న్యాయం జరిగింది, వారిలో ఎందరికి ప్రభుత్వపరంగా పరిహారం అందించారనే వివరాలను సీపీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం భరోసా కేంద్రం అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ రంగనాథ్ మాట్లాడారు. లైంగిక దాడులకు గురైన మహిళలు, చిన్నారులకు స్వాంతన కలిగించే విధంగా భరోసా కేంద్రం నిలవాలన్నారు. ఇక్కడికి వచ్చిన వారికి న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితులకు కలిగించాలన్నారు. కోర్టు కేసులతోపాటు ట్రయల్స్‌ను కూడా ఎప్పటికప్పుడు భరోసా కేంద్రం సిబ్బంది పర్యవేక్షించాలని, అలాగే నిందితుల నేరాలు కోర్టులో నిరూపితమై వారికి శిక్షపడే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీ పుష్పారెడ్డి, క్రైం ఏసీపీ డేవిడ్‌రాజు, ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఎస్సై శ్రావణి, భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ సాగరిక, లీగల్ సపోర్ట్ ఆఫీసర్ నీరజ, సిబ్బంది పవిత్ర, నవ్య, రజిత పాల్గొన్నారు.



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

రెండు పూటలా స్నాక్స్ ఇవ్వాలి

సమగ్రశిక్షా జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్

కమలాపూర్: పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతుల్లో రెండు పూటలా స్నాక్స్ ఇవ్వాలని సమగ్రశిక్షా జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ హెచ్‌ఎంలకు సూచించారు. భీంపల్లి, శంభునిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్లాస్‌రూమ్ అబ్జర్వేషన్‌లో భాగంగా ఉపాధ్యాయుల బోధనా సరళిని పరిశీలించి.. గణితంలో చతుర్వేద ప్రక్రియలను బోర్డుపై చేయిస్తూ.. తెలుగు, ఆంగ్లంలో ధారాళంగా చదివిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా పరీక్షించారు. అనంతరం కమలాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించి.. ఒకేషనల్ తరగతి గదిని పరిశీలించారు. విద్యార్థులు కంప్యూటర్లను ఎలా వినియోగిస్తున్నారు.. కుట్లు, అల్లికల ద్వారా వేటిని తయారు చేయడం నేర్చుకుంటున్నారనే దానిని, క్రాఫ్ట్, డ్రాయింగ్ రికార్డులను పరిశీలించారు. తర్వాత ఉప్పల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులను కలిసి రోజువారీగా వారికి అందిస్తున్న స్నాక్స్ పంపిణీని పరిశీలించారు. విద్యార్థులను వార్షిక పరీక్షలకు శారీరకంగా, మానసికంగా సన్నద్ధం చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. కార్యక్రమాల్లో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మల్లయ్య, పీడబ్ల్యూసీ పవన్, సీఆర్పీలు సుభాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వృత్తి శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

విద్యారణ్యపురి: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా అన్ ఎయిడెడ్, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(హడుప్సా) ఆధ్వర్యంలో 41 ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన టెన్త్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. హడుప్సా జిల్లా అధ్యక్షుడు వర్ధమాన్ జనార్దన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉదయం డీఈఓ ఎండి.అబ్దుల్‌హై, డీసీపీ ఎంఏ బారి ప్రారంభించారు. అనంతరం అన్ని సబ్జెక్టుల విషయ నిపుణులు విద్యార్థులకు ఆయా సబ్జెక్టులలోని ప్రశ్నపత్రాలపై అవగాహనతోపాటు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా వినయ్‌భాస్కర్ పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హడుప్సా గౌరవ సలహాదారుడు టి.బుచ్చిబాబురావు, కోశాధికారి శంకర్, ఉపాధ్యక్షుడు టి.రాజేశ్వర్‌రావు, బాధ్యులు రామారావు, సంపత్‌రెడ్డి, పి.వేణుమాధవ్, ఎం.సంతోష్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకటరమణ, ఏఎం రెడ్డి, వైపీ రావు, రామచంద్రమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు



హాజరైన కలెక్టర్లు, సీపీ, మున్సిపల్ కమిషనర్, మేయర్



యోగాతో మానసికోల్లాసం



దినచర్యలో భాగం చేసుకోవాలి

● మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

● ఘనంగా ప్రారంభమైన యోగా మహోత్సవ్



యోగా చేస్తున్న మహిళలు

హన్మకొండ కల్చరల్: ప్రతిఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకుంటే శారీరక, మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని, ఓరుగల్లు ప్రజలు యోగా శిక్షణలో పాల్గొనాలని పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ, హార్ట్‌ఫున్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. హనుమకొండ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకుముందు యోగా గురువు, పద్మవిభూషన్ దాజి (కమలేష్ దేసాయి భాయ్ పటేల్)ను స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కన్హా శాంతివనం తరహాలోనే ఓరుగల్లు సమీపంలో శాంతివనాన్ని నిర్మించడానికి తగిన ఏర్పాట్లను చేస్తామన్నారు. వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన భారతదేశంలో యోగా పట్ల ఆసక్తిని కలిగించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. యోగా గురువు దాజీ మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా యోగాను ఆచరిస్తున్నారని, ధ్యానంతో మనసు ప్రశాంతత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, గోపి, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, ప్రఖ్యాత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, సీపీ ఏవీ రంగనాథ్, కేయూ వీసీ ఆచార్య రమేష్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య, విద్యార్థులు, అధికారులు పాల్గొని శిక్షణ నిపుణుల ద్వారా యోగా, ధ్యానం ఆచరించారు.

మంత్రి ఫోన్ పోయిందంటూ హైరానా

చిల్పూరు: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు చెందిన ఫోన్ పోయిందని తెలపడంతో అధికారులు, పోలీసులు, నాయకులు కొద్ది సేపు హైరానా పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం చిల్పూరు మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద చోటు చేసుకుంది. వివరిలాల ఉన్నాయి..వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణానికి హాజరైన మంత్రితో పాటు ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డిలు హాజరయ్యారు. స్వామివారి తలంబ్రాలు సమర్పించిన అనంతరం వెలుతున్న క్రమంలో తన మొబైల్ ఫోన్ కనిపించడం లేదని తెలపడంతో అందరు హైరానా పడ్డారు. మైకులో సైతం ప్రచారం చేశారు. కాసేపటికి చైర్మన్ శ్రీధర్‌రావు, అర్చకులు స్వామివారి మహిమతో ఫోన్ దొరికిందంటూ మైకులో తెలిపారు. ఇంతకీ ఆ ఫోన్ మంత్రి గారి కారులోనే ఉందనడంతో సంతోషపడ్డారు.



యోగా చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు, వీసీ తదితరులు

తూర్పుకోటలో దొంగల బీభత్సం

● పెద్దమ్మ తల్లిగుడిలో హుండీ ధ్వంసం

● నగదుతోపాటు ఆభరణాల అపహరణ



హుండీని పరిశీలిస్తున్న ఎస్సై రాజేందర్

ఖిలా వరంగల్: వరంగల్ 37వ డివిజన్ తూర్పు కోటలో దొంగలు బీభత్సం సృష్టించారు. పెద్దమ్మ తల్లి దేవాలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి హుండీలోని నగదుతో పాటు వెండిహారం, విలువైన వస్తువులను అపహరించారు. ఆలయ పూజారి హంస వెంకన్న, మత్స్యపారిశ్రామిక పరస్పర సహాయ సహకార సంఘం అధ్యక్షుడు సంగరబోయిన చందర్ కథనం ప్రకారం.. తూర్పుకోట పరిసరాల్లోని పెద్దమ్మ తల్లి గుడిలో నిత్య పూజలు జరుగుతాయి. రోజువారీగా గురువారం ఉదయం, సాయంత్రం వెంకన్న అమ్మవారికి నైవేద్యాలు పెట్టి తాళం వేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చారు. గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గడ్డపారతో ఆలయ గేటు తాళం పగలుగొట్టి గుడిలోకి ప్రవేశించి హుండీ బయటకు ఎత్తుకెళ్లి నగదుతోపాటు అమ్మవారి వెండి హారం, భక్తుల వేసిన విలువైన వస్తువులను అపహరించుకుపోయారు. ఆలయ పూజారి వెంకన్న శుక్రవారం ఉదయం గుడికి వెళ్లగా గుడి గేటు తాళం ధ్వంసం చేసి ఉండటాన్ని చూసి గుడిలో దొంగతనం జరిగిందని గ్రహించి కులపెద్దలతోపాటు పోలీసుల సమాచారం అందజేయగా ఘటన స్థలానికి ఎస్సై ముత్యం రాజేందర్, సాంబయ్య చేరుకుని వివరాలు సేకరించారు. ఆలయానికి దూరంగా దుండగులు పడేసిన హుండీ, గడ్డపారను స్వాధీనం చేసుకున్నారు. వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి



సందీప్ (ఫైల్)

కాశిబుగ్గ: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం, వెంకటాపూర్‌కు చెందిన వరిపెల్లి సందీప్ అలియాస్ సన్నీ (26) తన తమ్ముడు రాజుతో కలిసి వరంగల్ నగరంలో నివాసం ఉంటూ హంటర్‌రోడ్డులోని టిఫిన్ బండిపై మాస్టర్ కుక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అండర్‌బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. దీంతో సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.



భిక్షపతి మృతదేహం

మోపెడ్ అదుపు తప్పి..

బచ్చన్నపేట: మోపెడ్ వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మన్‌సాన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంజాల భిక్షపతి (60) గ్రామంలో పోస్టుమెన్ ఇస్తున్న పెన్షన్‌ను తీసుకోవడానికి మోపెడ్ వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయాడు. గమనించిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్ట్ కిల్లర్‌పై పీడీ యాక్ట్



నిందితుడికి పీడీ యాక్ట్ పత్రాలు అందజేస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం: సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడిన నిందితుడిపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడిన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన గడ్డం రత్నాకర్‌పై సీపీ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను కాజీపేట ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి నిందితుడికి శుక్రవారం కరీంనగర్ కారాగారంలో అందజేసిన అనంతరం నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు గత సంవత్సరం కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మహిళ వద్ద సుపారీ తీసుకొని ఆమె భర్తను దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనలో సుపారీ కిల్లర్‌తో పాటు సుపారీ ఇచ్చిన మహిళతో సహా మరో ముగ్గురిని అరెస్టు చేశారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు గతంలో రాచకొండ, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాలో సుపారీ తీసుకొని హత్యలకు పాల్పడినట్లు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయబడుతాయని సీపీ హెచ్చరించారు.

భార్యపై భర్త దాడి..

● ఐరన్ పైపుతో కొట్టడంతో తీవ్ర గాయాలు



భర్త దాడిలో గాయపడిన సరిత

ఖిలా వరంగల్: భర్త వేధింపులు తాళలేక ఇద్దరి పిల్లలతో కలిసి పుట్టింటిలో తలదాచుకుంటున్న ఓ మహిళను అకస్మాత్తుగా రోడ్డుపై భర్త ఐరన్ పైపుతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఈ ఘటన శుక్రవారం శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట చోటు చేసుకుంది. బాధితురాలి తల్లి గద్దల శారద తెలిపిన వివరాల ప్రకారం.. శంభునిపేట నాగేంద్రనగర్ కాలనీకి చెందిన గద్దల శారద కుమార్తె సరిత (27)ను పదేళ్ల క్రితం నర్సంపేట మండలం నాగుర్లపెల్లి గ్రామానికి చెందిన వేల్పుల రఘు (30)కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. రఘు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సరిత, ఇద్దరు పిల్లలు పోషిస్తున్నాడు. మూడేళ్ల క్రితం రఘు మద్యానికి బానిసై భార్య సరితను కొట్టడంతో వరంగల్ నాగేంద్రనగర్‌లోని పుట్టింటికి వచ్చింది. భార్యాభర్తల పంచాయితీ పలుమార్లు గ్రామ పెద్దల ఎదుట జరిగింది. పద్ధతి మార్చుకుంటానని చెప్పి భార్య, పిల్లలను తీసుకెళ్లి మళ్లీ చిత్ర హింసలకు గురిచేయడంతో సరిత పిల్లలతో కలిసి పుట్టింటిలో ఉంటుంది. ఈ విషయమై రెండేళ్ల క్రితం వరంగల్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో సరిత కేసు పెట్టింది. ఇద్దరి పిల్లలను శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిస్తూ తాను వరంగల్ చౌరస్తాలోని ఓ షాపులో పనిచేస్తూ జీవనం గడుపుతుంది. శుక్రవారం ఉదయం పిల్లలను పాఠశాలకు పంపించి షాపుకు బయలుదేరుతున్న సమయంలో అకస్మాత్తుగా సరిత భర్త రఘు కాపురానికి రాకుంటే చంపేస్తానంటూ ఐరన్ పైపుతో దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. భారీగా స్థానికులు రావడంతో రఘు అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న సామాజిక కార్యకర్త ఎండీ ఫసీ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని ఎంజీఎంకు తరలించారు. సరిత తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించినా.. సకాలంలో స్పందించలేదని సామాజిక కార్యకర్త ఫసీ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ ఉర్సు గుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26777]

■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సంప్రదించండి: సెల్: 7660008666, 8309035091. [WA-26775]

■ వరంగల్ రంగశాయిపేట శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26749]

PLOT FOR SALE

■ 250 sq.yds East Facing Plot for sale in KLN Reddy Colony, Hanamkonda, Warangal. Cell: 9866295406. [W-1170527]

■ వరంగల్ to పరకాల మేన్‌రోడ్డుకు గూడెప్పాడ్ జంక్షన్ దగ్గర విట్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా 150 Sq.Yds గల Plots కలవు. వెంటనే సంప్ర: 7780386570. [W-775839]

■ హన్మకొండలోని రెడ్డిపురం కెనాలు కట్ట దగ్గర 374 గజాల ప్లాటు అమ్మడానికి ఉంది దగ్గరలో వైర్లు ఉన్నందున కేవలం గజానికి 12,000 రూ॥లు మాత్రమే. సెల్: 9246890951. [W-775786]

FLATS FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంట్‌లో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26773]

SERVICES

LOANS

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ ఋణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL. 9618767116 [W-775838]

■ బాలాజీ కన్సల్టెంట్ : (IT రిటర్న్స్, GST, పాన్‌కార్డ్) చేయబడును. బిజినెస్ లోన్స్, మార్టిగేజ్, పర్సనల్ లోన్స్ ఇప్పించబడును. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. సంప్ర॥ 85228 25358, 97014 32383. [M-1190583]

CONSULTANT

■ Concord IT Systems INC. Filing H1B for the fiscal year 2023-24. 100% approval rate. Immediate GC processing for deserving consultants. Send your resume at Info@concorditsystems.com +13139693206 / +91 83286 37311 / +91 70954 90108 [H-793342]

INVESTMENT

■ భూమి పైన పెట్టుబడి పెట్టే వారికి సువర్ణ అవకాశం, యాదగిరి గుట్టకి దగ్గరలో 242Sq. కొనండి. ప్రతినెలా అద్దె పొందండి. ఫోన్ : 9182282332. [H-787450]

WANTED

■ Delicious Farms Chicken outlets is hiring for following positions in Warangal. 1) Collection Executive / Delivery Executive, 2) Accounts Executive Relevant experience is mandatory Age 20-35 yrs, Cont: 8106112401. [W-775840]

■ కుటుంబ సమేతంగా అనుభవం కలిగిన డ్రైవర్ కావలెను. వసతి కల్పించబడును. సెల్: 9182922080 [WA-12803]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]

■ లేపాక్షి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 20K. ఏజెంట్ కమీషన్ 5K. Ph: 9640300074 [HA-1047]

■ అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్త రికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730899503 [G-502]

■ అన్నపూర్ణ హోమ్ కేర్ Govt Reg:లో బేబీ కేర్, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్ స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. Ph: 9390427694 [H-778974]

■ సెక్యూరిటీ సూపర్ వైజర్స్ - 17000/-, సెగార్డ్స్ - 14000/- మరియు ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. ఏరియా: బాలానగర్, బాచుపల్లి, మణికొండ, జీడిమెట్ల, జూబ్లీహిల్స్, Q: 10th-Degree, మెట్రో మేనేజ్‌మెంట్ సర్వీసెస్. ఫోన్: 9885657755 [H-792981]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన జీతం కలదు. మరిన్ని వివరాలకు సంప్ర: 93919 94780. [L-521]

■ వరంగల్ సిటీలో పనిచేయుటకు మా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ ఆఫీసర్ & సూపర్‌వైజర్ కావలెను. సంప్రదించండి. సెల్: 9069234678 [Y-784352]

■ నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో ఇంట్లో 24 గం॥లు వృద్ధున్ని చూసుకోవడానికి ఇంటిపనికి పురుషులు కావలెను. జీతం: 15 వేలు, ఫ్రీ వసతి +భోజనం. సంప్ర॥ సెల్: 9848652107 [Y-784319]

WANTED TEACHERS

■ Akshara, The Planet School, launching at Hanamkonda, Opp: KITS Engineering College Besides Erragattu Gutta, Hasanparthy, requires Principal, Vice-Principals, MEOs and Non-teaching staff. Interested and eligible candidates can attend the Interview on 5th Sunday 6th Monday morning 11am to 2pm. Cont: 7981267643, 9182658766. [W-775841]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

తన ప్రేమను నిరాకరించిందని..

● రైలు కిందపడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

కాజీపేట రూరల్: తాను ప్రేమించిన అమ్మాయి దక్కదని జీవితంపై విరక్తి చెంది ఓ బీటెక్ విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాజీపేట, కోమటిపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కె.దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన పాలమేని నరేష్ (20) మహేశ్వరంలోని ఓ కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మృతుడి తండ్రి సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాను ప్రేమించిన అమ్మాయి తన ప్రేమను నిరాకరించిందని జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని నిర్ణయించుకొని కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలో డౌన్ మార్గంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఉరి వేసుకొని యువకుడు...

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ కాలనీలో శుక్రవారం ఇప్పకాయల శివ (25) అనే యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలని మానసిక కుంగుపాటుతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తల్లి భాగ్యరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు షుకూర్ తెలిపారు.

రూ.1.72 లక్షలు మాయం

కాజీపేట: ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ రావడంతో లిఫ్ట్ చేసి వారు అడిన వివరాల తెలపడంతో రూ.1,72,291లను పోగొట్టుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కథనం ప్రకారం.. బాధితుడికి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాం .. మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకోవాలని సూచించగా నిజమేనని నమ్మి వారు అడిగిన వివరాలను చెప్పడంతో బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం అయ్యింది.

ముగ్గురిపై కేసు నమోదు

కాజీపేట: కాజీపేట పట్టణంలో మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. పట్టణంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టగా నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతుండడమే గాకుండా సరైన కాగితాలు లేవన్నారు. పత్తి నిరంజన్, వడ్డెపల్లి రామకృష్ణ, కట్కూరి సృజన్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

ఆకతాయిలను పట్టుకున్న షీ టీం



విద్యార్థులతో మాట్లాడుతున్న షీటీం పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్న పాఠశాల వద్ద ప్రతిరోజు సాయంత్రం సమయంలో ఆకతాయిలు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని శుక్రవారం 'సాక్షి'లో 'విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన షీటీం పోలీసులు శుక్రవారం సాయంత్రం షీటీం ఏసీపీ డేవిడ్ రాజ్, ఇన్‌స్పెక్టర్ సంజీవరావుల నేతృత్వంలో పాఠశాలకు వచ్చే దారిలో ఉన్న 12 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మహిళల రక్షణకు షీటీం పనిచేస్తాయన్నారు. ఎలాంటి సమయాల్లోనైన మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సాప్‌లో గాని, సోషల్ మీడియాలోనైన వేధింపులకు గురిచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలు, మహిళలు 87126 85257, 87126 85142, 87126 85270లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బాలికలను వేధిస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. అనంతరం అదుపులోకి తీసుకున్న ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు విద్యాసాగర్, కుమారస్వామి, ఎస్ఐ స్వాతి, ఏఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు వంశీకృష్ణ, రాంరెడ్డి, పూర్ణ పాల్గొన్నారు.

ప్రీతి ఘటనలో విచారణ వేగవంతం

● రెండో రోజు సైఫ్‌ను విచారించిన పోలీసులు

ఎంజీఎం: ప్రీతి ఘటనలో పోలీసుల విచారణ వేగవంతంగా కొనసాగుతుంది. రెండు రోజులుగా సైఫ్‌ను కస్టడీకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. శుక్రవారం విచారణలో పోలీసులు మరింత పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ప్రీతికి సంబంధించిన సెల్‌ఫోన్ సమాచారం వివరాలతో పోలీసులు కేసు మిగతా ఆధారాల కోసం ముందుకు సాగుతున్నట్లు తెలిసింది. ప్రీతి సెల్‌ఫోన్‌లో 27 స్క్రీన్ షాట్స్, మెస్సేజ్‌లు కీలకంగా మారినట్లు వెల్లడవుతోంది. మెడికో, ఎల్‌డీడీ నాకౌట్ వాట్సాప్ గ్రూపుల నుంచి, మరో ముగ్గురు వైద్యుల నుంచి మెసేజ్‌లు సేకరించారు. సేకరించిన వాటిపై పోలీసులు సైఫ్ నుంచి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఘటన స్థలంలో ఉన్న హెడ్‌నర్సు, స్టాఫ్ నర్సు నుంచి కూడా మరిన్ని వివరాలు రాబట్టినట్లు చర్చించికుంటున్నారు. ప్రీతీ వాడిన హ్యాండ్ బ్యాగ్‌లో ఏయే వస్తువులు ఉన్నాయనే వివరాలు పోలీసులు తెలుసుకున్నారు. ఘటన రోజు విధులు నిర్వర్తించిన సెక్యూరిటీ గార్డుల నుంచి కీలకమైన అంశాలను సేకరించినట్లు ఎంజీఎంలో సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. సైఫ్ నుంచి సేకరించిన సాంకేతిక ఆధారాలను పోల్చుతూ విచారణ కొనసాగిస్తున్నారు. కేసు పురోగతిపై త్వరలోనే కొలిక్కి తేస్తారనే వాదన వినిపిస్తోంది.

దోషులను కఠినంగా శిక్షించాలి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాంచందర్‌నాయక్



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

● ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

కొడకండ్ల: బంగారు భవిష్యత్ కలిగిన బంజార బిడ్డ ధరావత్ ప్రీతి చదువు దుర్మార్గుడి ర్యాగింగ్‌కు బలవడం విచారకరమని, పోలీసులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని గిర్నితండాలో ప్రీతి తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకొని ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ సీటు ప్రభుత్వ కళాశాలలో సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రీతి మృతి కుటుంబానికి కాదని, సమాజానికి తీరని లోటన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో దర్యాప్తు చేయిస్తుందని, సీపీ రంగనాథ్ నేతృత్వంలో నిస్పక్షపాతంగా దర్యాప్తు చేసి దోషులకు శిక్ష పడేలా చేస్తాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవాసంఘ్ నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌నాయక్, హేమనాయక్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైఫ్‌ను ఉరితీయాలి

హన్మకొండ: డాక్టర్ ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రీతి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ క్యాండిల్స్ వెలిగించారు. ఈ సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ వైద్య విద్యార్థిని ప్రీతి మరణం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు రావుల కోమల, గుజ్జుల వసంత, జిల్లా కార్యదర్శి తోపుచర్ల అర్చన, కేతిరెడ్డి విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో అక్రమంగా తరలిస్తున్న 60 కేజీల గంజాయిని శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేయగా, మరొకరు పరారైనట్లు వారు తెలిపారు. స్థానిక కొత్తకాలనీ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఇదే సమయంలో వరంగల్‌కు చెందిన వి. రాజు, జగ్గన్నపేటకు చెందిన ఎల్. రవీందర్ ధారకొండ నుంచి గంజాయిని ఆటోలో తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు. ధారకొండకు చెందిన కొర్రా ముకుంద అనే వ్యక్తి పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.